నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, మంగళవారం 27 ఆగస్టు 2024 | KARIMNAGAR

₹2 లక్షలు మాఫీ కావాలంటే..

వివిధ బ్యాంకుల్లో ₹2లక్షలకంటే ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకున్న రైతులుగానీ, ₹2 లక్షలు తీసుకుంటే వడ్డీ కలిపి మాఫీ మార్క్ దాటిన రైతులుగానీ, అదనంగా ఉన్న నగదును బ్యాంకుల్లో చెల్లిస్తేనే ప్రభుత్వం ₹2 లక్షలు మాఫీ చేస్తుందని ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తున్నది. మూడు విడుతల్లో మాఫీ చేసే అవకాశమున్నట్లు విశ్వసనీయ సమాచారం. ₹2.50లక్షలకు ఒక సారి, ₹3లక్షల వరకు రెండో సారి, ₹3 లక్షల పైన ఉన్న వాటికి మూడోసారి షెడ్యూల్ విడుదల చేసి విడతల వారీగా మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తున్నది. అయితే ఈ విషయంలో రైతుల వాదన మరో విధంగా ఉంది. ₹2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాటకు కట్టుబడి ఉండాలని, రైతులు బ్యాంకుల్లో ఎంత బాకీ ఉన్నా ఇదే విడుతల వారీగా మాఫీ చేయాలని స్పష్టం చేస్తున్నారు. తమకు వీలున్నపుడు మిగతా మొత్తం చెల్లించి తిరిగి రుణాలు తీసుకుంటామని అంటున్నారు.

రైతులందరికీ ఏకకాలంలో ₹2లక్షల రుణమాఫీ చేస్తానని మొండిచెయ్యి చూపిన సర్కారు, ఇప్పుడు మళ్లీ నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. సర్వేచేసి అర్హులైన వారికి అందేలా చూస్తామని వారం పది రోజులుగా కబుర్లకే పరిమితమైపోయింది. ఓ వైపు గ్రీవెన్స్‌లో దరఖాస్తుల పరిశీలనకు 'రైతు భరోసా– రుణమాఫీ' పేరుతో ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించి అందించినా, విధి విధానాలు రూపొందించలేదని తెలిసింది. ఏవిధంగా సర్వే చేయాలి? ఎలా అప్‌లోడ్ చేయాలి? అనే విషయాలపై స్పష్టత లేదని, సర్వేకు యంత్రాంగానికి ఆదేశాలు ఇవ్వలేదని తెలుస్తున్నది. ప్రస్తుతం అందించిన అప్లికేషన్‌లోనూ కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణకు మాత్రమే అవకాశం ఇచ్చిందని అధికారులు చెబుతుండగా, మరి మిగతా సమస్యల సంగతేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అసలు సర్వే చేస్తారా..? రాని వారికి రుణమాఫీ ఇస్తారా..? అని అనుమానపడుతున్నారు.

రుణమాఫీ సర్వే ఎప్పుడు?

- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల పరిశీలనకు సర్కారు స్పెషల్ యాప్ తెచ్చినా స్పష్టత కరువు
- ప్రస్తుతం కుటుంబ సభ్యుల నిర్ధారణకే పరిమితం
- మిగతా సమస్యల పరిష్కారం గాలికేనా?
- నేటి రైతు 'నేస్తం'లోనైనా సర్వేకు ఆదేశాలు వచ్చేనా..?
- అన్నదాతను వెంటాడుతున్న అనుమానాలు

కరీంనగర్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు పదే పదే చెప్పుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొర్రీలు పెడుతున్నారు. ఫలితంగా వేలాది మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. రైతులందరికీ ఒకేసారి మాఫీ చేస్తామని చెప్పినా అదీ అమలు కాలేదు. పైగా మూడు విడతల్లో మాఫీ చేసినా అనేక తప్పిదాలతో రైతులు రోడ్డెక్కే దుస్థితి వచ్చింది. రైతుల నిరసన సెగలకు రాష్ట్ర ప్రభుత్వం దిగి రావల్సి వచ్చింది. రుణమాఫీ కాని రైతులు రైతు వేదికలు, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. ఈ దరఖాస్తులు చేసుకున్న వారిలో 33 శాతానికి పైగా రేషన్ కార్డులు లేకనే రుణమాఫీకి నోచుకోలేదని నిర్ధారణకు వచ్చారు. కరీంనగర్ జిల్లాలో గ్రీవెన్స్‌లో మొత్తం 8,870కిపైగా దరఖాస్తులు వస్తే, అందులో 2,870 వరకు రేషన్ కార్డులు లేకనే ఆగిపోయినట్టు గుర్తించారు. వీటిని పరిశీలించి రుణమాఫీ వచ్చేలా చేసేందుకు రాష్ట్ర సర్కారు ప్రత్యేకంగా 'రైతు భరోసా– రుణమాఫీ' పేరుతో ఒక యాప్‌ను రూపొందించింది. రెండు రోజుల క్రితమే ఈ యాప్‌ను వ్యవసాయ శాఖకు ఇచ్చింది. అయితే కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసమే మండల వ్యవసాయ అధికారులకు మాత్రమే లాగిన్ అవకాశం ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీరంతా శని, ఆదివారాల్లో ఒక్కో రైతు వివరాలను సేకరించి ట్రయల్ కూడా ముగించారు. అంతా సవ్యంగానే ఉండగా తదుపరి ఆదేశాల కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. అయితే ఇప్పటి వరకు యాప్ విధి విధానాలు రూపొందించనట్లు తెలుస్తున్నది. అధికారులు ఏవిధంగా సర్వే చేయాలి? ఎలా అప్‌లోడ్ చేయాలి? అనే విషయాలపై మార్గదర్శకాలు వచ్చిన తర్వాతనే సర్వే చేస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రతి మంగళవారం కొన్ని ఎంపిక చేసిన రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సర్వేకు ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

మిగతా సమస్యలు ఎలా..?

రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలు కొర్రీలు పెట్టడంతో మెజార్టీ రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. ప్రభుత్వం విధించిన కటాఫ్ డేట్‌లోగా ₹2 లక్షలలోపు, ఆపైన అప్పు తీసుకున్న రైతుల జాబితాను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఎంత మంది అర్హులు ఉన్నారనే విషయం ఇప్పటి వరకు ఇటు అధికారులకుగానీ, అటు బ్యాంకర్లకుగానీ సరైన సమాచారం లేదు. కరీంనగర్ జిల్లాలో మొదటి విడతలో ₹లక్ష లోపు ఉన్న 38,894 మందికి ₹201.46 కోట్లు, రెండో విడతలో ₹1.50 లక్షల వరకు ఉన్న 19,420 మందికి ₹182.44 కోట్లు, మూడో విడతలో ₹2లక్షల వరకు ఉన్న 12,034 మంది రైతులకు ₹152.65 కోట్ల చొప్పున మొత్తం మూడు విడతల్లో 70,348 మంది రైతులకు ₹536.55 కోట్లు మాఫీ చేసింది. మూడో విడత జాబితా విడుదలైన తర్వాత మెజార్టీ రైతుల పేర్లు గల్లంతు కావడంతో బ్యాంకుల ముట్టడి, ధర్నాలు, రాస్తారోకోలకు దిగారు. ఎక్కడ చూసినా ఆందోళనలు మిన్నంటడంతో గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే వేలాది మంది రైతులు రుణమాఫీకి నోచుకోకపోగా కేవలం 8,870 దరఖాస్తులు మాత్రమే గ్రీవెన్స్‌లో వచ్చాయి. దరఖాస్తు చేసుకోని వారు ఇంకా వేల సంఖ్యలోనే ఉన్నారు. అయితే వచ్చిన దరఖాస్తుల్లో కేవలం కుటుంబ సభ్యుల నిర్ధారణకు అంటే రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలను గుర్తించి వారిలో ఎంత మంది రుణం తీసుకున్నారు? ₹2 లక్షల రుణం వర్తిస్తుందా? లేదా అనే విషయాలను మాత్రమే మండల వ్యవసాయ అధికారులు పరిశీలించనున్నారు. అయితే ఆధార్ నంబర్ సరిగ్గా లేక, పేర్లు, తండ్రి పేర్లు కలవక, బ్యాంకు వివరాలు సరిగ్గా లేకపోవడం, ఖాతాలో జమ చేసిన నగదు వాపసు వెళ్లడం వంటి అనేక సమస్యల కారణంగా రుణమాఫీ కాని రైతులు ఇంకా వేల సంఖ్యలో ఉన్నారు. అయితే వీటిలో కొన్ని సమస్యలను పరిష్కరించే బాధ్యతలను బ్యాంకర్లకు కూడా అప్పగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. కానీ, బ్యాంకర్లు ఎంత వరకు అంగీకరిస్తారనేది సందేహమే.

అఫిడవిట్ ఇవ్వాల్సిందేనట!

తమకు రుణమాఫీ కావాలంటే రైతులు అఫిడవిట్ ఇవ్వాల్సిందేనట. భార్యాభర్తలు రుణం తీసుకున్న కుటుంబాల్లో ₹2 లక్షల వరకు మాఫీకాని రైతుల విషయంలో ప్రభుత్వం రేపోమాపో నిర్వహించే సర్వేలో రైతులు తమ కుటుంబ సభ్యులేనని ధ్రువీకరించాల్సి ఉంటుంది. 18 ఏండ్లు నిండిన ప్రతి కుటుంబ సభ్యుడి పేరును ప్రభుత్వానికి రాసి ఇవ్వాలి. రైతులు రాసి ఇచ్చిన పేర్లు ఇతని కుటుంబానికి సంబంధించినవేనని పంచాయతీ కార్యదర్శి అటెస్టేషన్ చేయాల్సి ఉంటుంది. దానిని మండల వ్యవసాయ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా రైతు తీసుకున్న రుణం ఎంత? ఏ బ్యాంకు, ఏ శాఖ తదితర విషయాలు అధికారులకు అందించాల్సి ఉంటుంది. మండల వ్యవసాయ అధికారులు కూడా వాళ్లు సర్వే చేసిన ప్రతి కుటుంబంతో సెల్ఫీ దిగాల్సి ఉంటుంది. త్వరలో ప్రారంభించే కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే ఇన్ని షరతులతో కూడుకుని ఉంది. రుణమాఫీ కావాలంటే ఇవన్నీ తప్పని సరి అని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రూ.2లక్షలు ప్రభుత్వమే చెల్లించాలి

రైతు రుణమాఫీ విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వానికే స్పష్టత లేదు. రెండు లక్షలకు పైన ఉన్న రైతులు ముందుగా ఎట్లా చెల్లిస్తరు? బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చినా ఇపుడు రైతుల వద్ద డబ్బులు ఉండాలి కదా! ఒక్కో రైతు మూడునాలుగు లక్షలు రుణం తీసుకుని ఉన్నరు. కొంత మందికి అంతకంటే ఎక్కువే ఉన్నయి. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే రెండు లక్షల కోసం రైతులు మళ్లా బయట అప్పులు చేయాల్నా..? ఇస్తానన్న ₹2 లక్షలు ఇచ్చేస్తే సరిపోతది కదా! ప్రభుత్వమే ముందు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంటది. రుణమాఫీ జరిగిన రైతులు కూడా సంతోషంగా లేరు. మా ఊళ్లో రెడ్డి వీరయ్య అనే రైతు ₹1.30 లక్షలు తీసుకున్నడు. వడ్డీతో కలిపి ₹1,36,500 అయ్యింది. ప్రభుత్వం ఏం చెప్పింది? మిత్తితో సహా చెల్లిస్తామని చెప్పింది కదా! మరీ వీరయ్యకు మాత్రం గత డిసెంబర్ 9 వరకే ₹1.32 లక్షలు ఇచ్చింది. ఆయన మిగతా ₹4,500 చెల్లించే వరకు బ్యాంకోళ్లు రెన్యువల్ చేయలేదు. వీరయ్య బాకీ ఉన్నది ₹2 లక్షలలోపే ఉన్నపుడు అతని మొత్తం బాకీ ఎందుకు మాఫీ చేయలేదు? ఈ విడతల వారీగా చేసి రైతులను మోసం చేసిన్రు. కనీసం సర్వేనైనా తొందరగా చేస్తున్నరా..? అంటే అదీ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలి.

- చింతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు (కన్నాపూర్)

సీఎంఆర్ఎఫ్ స్కాం!

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ దవాఖానల్లో దందా

- ఫేక్ బిల్లులతో స్వాహాపర్వం
- ₹కోట్లు దండుకున్నారనే ఆరోపణలు
- ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ బిల్లులూ క్లెయిమ్ చేశారనే ఫిర్యాదులు
- రంగంలోకి సీఐడీ అధికారులు
- పెద్దపల్లి, జమ్మికుంటలో కేసులు

ప్రైవేట్ దవాఖానలు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్), ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ కంపనీ పేరిట నకిలీ బిల్లులు క్లెయిమ్ చేసి ₹కోట్లు దండుకున్నాయా..? చికిత్స పొందకున్నా.. ఫేక్ బిల్లులు సృష్టించి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల బీమా సొమ్ము కాజేశాయా..? అంటే అవుననే తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా సంస్థల సొమ్ము స్వాహాపర్వం సాగినట్టు తెలుస్తుండగా, సీఐడీ రంగంలోకి దిగింది. తాజాగా పెద్దపల్లి, జమ్మికుంటలోని ప్రైవేట్ దవాఖానలపై కేసులు నమోదు చేయడం కలకలం రేపుతున్నది.

జమ్మికుంట, ఆగస్టు 26 : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రైవేట్ దవాఖానాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), ప్రైవేట్ బీమా సంస్థల సొమ్ము స్వాహా దందా నడిచిందనే ఆరోపణలు వచ్చాయి. ఆయా వైద్యశాలల నిర్వాహకులు, సిబ్బంది, దళారులు కలిసి నకిలీ బిల్లులు క్లెయిమ్ చేసి ₹కోట్లు కొల్లగొట్టారనే ఫిర్యాదులు ప్రభుత్వానికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. ఇప్పటికే ఓసారి ప్రాథమిక విచారణ జరిపారు. ఈసారి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసేందుకు రంగంలోకి దిగారు. సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా సంస్థలకు చెందిన బిల్లుల క్లెయిమ్‌లలో ఎవరి ప్రమేయం ఎంత? దవాఖాన యాజమాన్యాలదా? నిర్వాహకులదా? అందులో పనిచేసే సిబ్బందిదా? తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దవాఖాన యాజమాన్యాలకు తెలియకుండానే రూ.కోట్లు ఎలా కొల్లగొట్టారు? బిల్లులెలా సృష్టించారు? ప్రైవేట్ బీమా సంస్థల పాలసీల్లో ఆయా సంస్థలకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రమేయం లేకుండా ఎలా క్లెయిమ్‌లు జరుగుతాయి? నకిలీ రోగులెవరు? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. తాజాగా, సీఎంఆర్ఎఫ్ స్కాంలో ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలపై రెండు కేసులు నమోదు చేశారు. పెద్దపల్లిలోని శ్రీసాయి, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ని సప్తగిరి దవాఖానల్లో వైద్యం చేయకపోయినా.. చేసినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, నకిలీ బిల్లులు సృష్టించారు. నిర్వాహకులు, సిబ్బంది, దళారులు కుమ్మక్కై సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తులు చేసి, కోట్లాది రూపాయలు కొల్లగొట్టా రు. ఈ ఆరోపణల నేపథ్యంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించగా, సీఐడీ అధికారులు గతంలో విచారణ చేశారు. ఆ నివేదిక ప్రకారం ప్రస్తుతం రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి, సదరు దవాఖానలపై ఛీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేశారు.

కేసులతో కలకలం

కొద్ది నెలలుగా సైలెంట్‌గా ఉన్న సీఐడీ అధికారులు, మరోసారి రంగంలోకి దిగి ప్రత్యేక నజర్ పెట్టారు. ఏడాది క్రితం జమ్మికుంటలోని సప్తగిరి ప్రైవేట్ దవాఖానలో జరిగిన స్కాంపై ప్రాథమిక విచారణ చేశారు. ప్రస్తుతం పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నారు. దవాఖాన ఏర్పాటు, సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా సొమ్ము కాజేసేలా ఇచ్చిన బిల్లులు, తదితర విషయాలపై ఆరా తీశారు. రికార్డులు, బిల్లులు పరిశీలించి, నకిలీ బిల్లులను గుర్తించారు. తాజాగా, కేసు నమోదు చేశారు. పెద్దపల్లిలోని మరో దవాఖానపైనా కేసు నమోదు చేయడంతో కలకలం రేగింది. సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా సంస్థల సొమ్ము స్వాహాపర్వం చేసిన హాస్పిటళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు, దళారులు వణికిపోతున్నారు. ముమ్మందు మరింత లోతుగా దర్యాప్తు చేయనుండగా, అక్రమార్కులు బెదిరిపోతున్నారు. కాగా, సీఎంఆర్ఎఫ్, ప్రైవేట్ బీమా క్లెయిమ్‌లపై సీఐడీ కరీంనగర్ జిల్లా డీఎస్పీ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. గతంలో జమ్మికుంట సప్తగిరి దవాఖానలో విచారణ చేసిన విషయం నిజమేనని, ప్రాథమిక దర్యాప్తులో నకిలీ బిల్లులను కొన్ని గుర్తించామని చెప్పారు. రెండు మూడు రోజుల్లో దర్యాప్తు మరింత వేగవంతం చేస్తామని చెప్పుకొచ్చారు.

మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్ సింగ్

ధాన్యం, గన్నీ బ్యాగుల కొనుగోళ్ల టెండర్లలో అవినీతి

- సర్కారు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 26 : రాష్ట్రంలో ధాన్యం, గన్నీ బ్యాగుల కొనుగోళ్ల టెండర్లలో విచ్చలవిడి అవినీతి జరుగుతున్నదని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ₹1100 కోట్ల కుంభకోణం జరిగిందనే అరోపణలు ఉన్నాయని, గన్నీ బ్యాగ్‌ల్లోనూ ₹50 కోట్లు చేతులు మారాయని, దీనిపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవసరమైనన్నీ గన్నీ బ్యాగ్స్ కొనుగోలు చేయడంలో అలసత్వం వల్ల ఒక్క బ్యాగ్‌కు ₹14 నుంచి ₹18కు ధర పెరిగిందని, ఇది సర్కారు వైఫల్యమేనని ఆరోపించారు. ఒక్క గన్నీ బ్యాగుల విషయంలోనే సుమారు ₹50 కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఒక బ్యాగ్ బరువు 585 గ్రాములు ఉండాల్సి ఉండగా 400 గ్రాములు కూడా ఉండడం లేదన్నారు. ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్ (రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి) వసూలు చేస్తూ కమీషన్లు ఇస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఆర్ఆర్ ఇంప్లిమెంట్ చేయడానికి మాత్రమే టెండర్లు, గన్నీ బ్యాగ్‌ల కుంభకోణానికి తెరలేపారని విమర్శించారు. ఎఫ్‌సీఐ కేంద్రం చేతుల్లో ఉంటుందని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు ఈ అవినీతి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. చెడిపోయిన సంచులను తిరిగి అమ్ముతూ పెద్ద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఒక లారీ బస్తాలకు ₹21 వేల నష్టం జరుగుతుందన్నారు. ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి తూతూ మంత్రంగా ఇస్తున్నదని దుయ్యబట్టారు. తక్షణమే పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కోనుగోలు టెండర్లు, గన్నీ బ్యాగుల విషయంలో దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పెండ్యాల మహేశ్‌కుమార్, కెమసారం తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

కోరుట్లలోని ఓ రెస్టారెంట్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్న నిల్వ ఆహార పదార్థాలు

కుళ్లిన మాసం.. కల్తీ మసాలాలు

- కోరుట్లలోని పలు రెస్టారెంట్లలో నాణ్యతలేని ఆహారం
- మున్సిపల్ అధికారుల దాడుల్లో బహిర్గతం
- నిర్వాహకులకు ₹32 వేల జరిమానా

కోరుట్ల, ఆగస్టు 26: కోరుట్లలోని పలు రెస్టారెంట్లలో కుళ్లిన మాసం.. కల్తీ మసాలాలు.. కాలం చెల్లిన పదార్థాలతో తయారు చేసిన ఆహారం వినియోగదారులకు అందిస్తున్నట్టు తేలింది. మున్సిపల్ అధికారుల దాడుల్లో బయటపడడం కలకలం రేపింది. వివరాల ప్రకారం.. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో కోరుట్ల మున్సిపల్ అధికారులు సోమవారం పట్టణంలోని ఐదు రెస్టారెంట్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కుళ్లిన మాంసం, కల్తీ మసాలాలు, కాలం చెల్లిన, ఏమాత్రం నాణ్యత లేని పదార్థాలు వాడుతున్నట్టు గుర్తించారు. ఫుడ్ కలర్స్ కలిపిన మాంసం ఉత్పత్తులను, బిర్యానీలను, నిల్వ ఉంచిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత పట్టణ శివారులోని డంప్ యార్డుకు తరలించి పూడ్చివేశారు. ఇస్తా రెస్టారెంట్ యజమానికి ₹10 వేలు, ఎఫ్3 రెస్టారెంట్‌కు ₹10 వేలు, ఆర్బీ, డైమండ్ రెస్టారెంట్ నిర్వాహకులకు ₹5 వేల చొప్పున, పట్టణ శివారు జగిత్యాల రోడ్డులో ఉన్న గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ నిర్వాహకుడికి ₹2 వేల జరిమానా విధించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ, హోటల్, రెస్టారెంట్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించాలని, వినియోగదారులు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, మున్సిపల్ సిబ్బంది జగ్గళ్ల రమేశ్, చిట్యాల గంగరాజు, రమేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వచ్చే నెల 2న 'లాజిస్టిక్స్'లో వేలం

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 26 : కరీంనగర్ బస్టాండ్‌లోని డిపో–1 ఎదుట ఉన్న లాజిస్టిక్స్ కార్యాలయంలో వినియోగదారులు తీసుకెళ్లని వస్తువులను వచ్చే నెల 2న వేలం వేయనున్నట్లు లాజిస్టిక్ రీజియన్ మేనేజర్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలం పాటలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని సూచించారు. పార్సిల్ మీద బుకింగ్ చార్జి ఆధారంగా వస్తువుల ధరను నిర్ణయిస్తామన్నారు. లాజిస్టిక్ నిబంధన ప్రకారం డెలివరీ కార్యాలయానికి చేరుకున్న 40 రోజుల్లోగా వినియోగదారులు వస్తువును డెలివరీ తీసుకోకపోతే వాటిని వేలం వేస్తామన్నారు. వేలంలో మిగిలిన వస్తువులను డిపో క్యాషియర్‌వద్ద డిపాజిట్ చేసి మరోసారి వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

విలీన హామీ ఏమైంది?

కరీంనగర్ బస్టాండ్ ప్రయాణ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న నాయకులు

- ఎనిమిది నెలలైనా పట్టించుకోరా..
- రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- మా సమస్యలు పరిష్కరించాలి
- ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల నిరసన
- తమ పాలనలోనే న్యాయం జరగడం లేదని ఆవేదన

తెలంగాణచౌక్, ఆగస్టు 26 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆర్టీసీ కార్మికులు ప్రశ్నించారు. ఎనిమిది నెలలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీ తర్వోత పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులను రద్దు చేసి కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టీయూసీ) ఆర్టీసీ కార్మిక విభాగమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ ప్రయాణ ప్రాంగణంలో నిరసనకు దిగారు. అంతకు ముందు యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జిల్లా ఇన్‌చార్జి జక్కుల మల్లేశం ఆధ్వర్యంలో ఆర్ఎం కార్యాలయం ఎదుట నిరసన చేయడానికి చేరుకోగా, పోలీసు సెక్యూరిటీ గార్డులు అనుమతి ఇవ్వలేదు. దీంతో తమ ప్రభుత్వ పాలనలో శాంతియుత నిరసనను ఎందుకు అడ్డుకుంటురన్నారని వన్ టౌన్ సీఐ సిరిలాల్‌తో వాగ్వాదానికి దిగారు. సమస్యలను ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు నెలలుగా ప్రయత్నిస్తున్నా అనుమతి ఇవ్వడంలేదని తెలిపారు. అందుకే నిరసన చేపడుతున్నట్లు చెప్పారు. అయినా, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కనీసం మీడియాతో మాట్లాడనివ్వాలని కోరారు. దీంతో పోలీసుల సమక్షంలో జక్కుల మల్లేశం విలేకరులతో మాట్లాడారు. అధికారులు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డ్యూటీ చార్ట్‌లో సంతకం చేయకముందే బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేస్తున్నారని, మద్యం సేవించకున్నా ఘగర్, బీపీ లాంటి మందులు వాడినప్పుడు బ్రీత్ ఎనలైజర్ టెస్టులో పర్సంటేజీ చూపేడితే డ్రైవర్లను సస్పెండ్ చేస్తున్నారని తెలిపారు. గతంలో ఇలాంటి సంఘటనతో శ్రీనివాస్‌రెడ్డి అనే డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తు చేశారు. కంట్రోలర్ వద్ద బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి సరిపడా బస్సులేక పోవడంతో 60 మంది ఎక్కాల్సిన బస్సులో 100కు పైగా ప్రయాణికులు ఎక్కుతున్నారని, టికెట్ ఇచ్చే విషయంలో చిన్న పొరపాటు జరిగినా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని కేటగిరీల్లో సస్పెండ్ అయిన ఉద్యోగుల మీద త్వరగా విచారణ పూర్తి చేసి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు కార్మికులపై వేధింపులను ఆపాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో యూనియన్ రీజియన్ అధ్యక్షుడు టీపీ రెడ్డి, కార్యదర్శి ఎన్ఆర్ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో అధునాతన మేకప్ సౌకర్యం

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 26 : కరీంనగర్‌లో అధునాతన మేకప్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. నగరంలోని సెవెన్ హిల్స్ దగ్గర కార్పొరేట్ సదుపాయాలతో సోమవారం గ్లామ్ స్టూడియోను ప్రారంభించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా అధునాతన సౌకర్యాలతో ఫేషియల్, హెర్‌స్టైల్స్, స్కిన్, నెయిల్స్ కేర్, మేకప్స్‌తో పాటు ఇతర అన్ని రకాల సేవలు అందిస్తామని తెలిపారు. పెళ్లి కూతురు, పెళ్లి కొడుకును ప్రత్యేక మేకప్‌లు చేస్తామని చెప్పారు. గ్లామ్ స్టూడియో మెట్రో పాలిటన్ నగరాల్లో సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందినదన్నారు. అటువంటిది కరీంనగర్ పట్టణంలో నెలకొల్పడం గర్వంగా ఉందన్నారు. ఈ సదుపాయాలను నగర ప్రజలతో పాటు చుట్